మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
ఆదివారం 31 మే 2026 పేజీలు : 4


## సీఐగా శివకుమార్ యాదవ్‌కు పదోన్నతి



చందోల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మర్రి వెంకట శివకుమార్ యాదవ్‌కు ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. విధుల పట్ల నిబద్ధత, ప్రజలతో సత్సంబంధాలు, శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ ప్రమోషన్ దక్కింది.

బాపట్ల: రక్షణ బ్యూరో....

వివరాలు 2లో..



# బాపట్లలో జనసేనకు నాయకత్వ సంక్షోభం?

- పవన్ సొంత ప్రాంతంలో పార్టీ ఎందుకు బలహీనంగా మారింది?
- రెండు వర్గాలుగా చీలిన స్థానిక జనసేన శ్రేణులు
- కూటమి అధికారంలో ఉన్నా పార్టీ కార్యక్రమాలు కనిపించని పరిస్థితి

పవన్ కళ్యాణ్ పదే పదే గర్వంగా ప్రస్తావించే బాపట్లలోనే జనసేన పార్టీ నాయకత్వ సంక్షోభం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీకి సామాజికంగా, యువతలో బలం ఉన్నప్పటికీ దాన్ని కార్యాచరణగా మార్చే నాయకత్వం లేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యకలాపాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, సభ్యత్వ నమోదు మందగించడం, స్థానిక నేతల మధ్య విభేదాలు పెరగడం వంటి పరిణామాలు పార్టీ శ్రేణుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తేనే పార్టీకి మళ్లీ ఊపు వస్తుందనే అభిప్రాయం బలపడుతోంది.

2లో.

బాపట్ల: రక్షణ బ్యూరో....




## సూర్యలంకకు స్వర్ణశోభ

- తీరంలో బీచ్ ఆఫీస్ ను ప్రారంభించిన మంత్రి...
- యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం...
- సూర్యలంకకు అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యం..



వివరాలు 2లో..

సూర్యలంక బీచ్‌ను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయి. బీచ్ ఆఫీస్, మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ ప్రారంభంతో పాటు పలు మౌలిక సదుపాయాలకు శ్రీకారం చుట్టిన మంత్రి కొలుసు పార్థసారథి అభివృద్ధి ప్రాధాన్యాన్ని చాటారు.

బాపట్ల: రక్షణ బ్యూరో....

## నేరస్తులకు శిక్షే సమాధానం

- మహిళా నేరాలపై జీరో టాలరెన్స్..
- మహిళల రక్షణే తొలి ప్రాధాన్యం..
- నేరస్తులకు ఎస్పీ కట్టిన సందేశం..




వివరాలు 2లో..

మహిళలపై నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని నిరూపిస్తూ బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టారు. 'జీరో టాలరెన్స్' విధానంతో వేగవంతమైన దర్యాప్తు, కఠిన శిక్షల ద్వారా మహిళా భద్రతకు కొత్త భరోసా కల్పిస్తున్నారు.




బాపట్ల: రక్షణ బ్యూరో....

## సీఎం రాకకు సర్వం సిద్ధం

- హాస్పిటల్ ప్రాంగణంలో ముమ్మర తనిఖీలు
- పారిశుధ్యంపై కమిషనర్ ఆదేశాలు
- ఎలాంటి లోపాలకూ తావులేదు

వివరాలు 2లో..



గుంటూరు రక్షణ న్యూస్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 3న పీవీఎస్ లలితా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పర్యటనలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని శాఖలను అప్రమత్తం చేస్తూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 5/31/2026 3:45 AM Page 2



# నేరస్తులకు శిక్షే సమాధానం

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో మహిళల భద్రతను అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకున్న జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు దూకుడుగా ముందుకెళ్తున్నారు. చీరాలలో నిర్వహించిన మహిళా భద్రత, సాధికారత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, 'ఆపరేషన్ దండాయన' పోస్టర్‌ను ఆవిష్కరించి నేరస్తులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో బాపట్ల పోలీస్ శాఖ 'జీరో టాలరెన్స్' విధానాన్ని అమలు చేస్తోందని స్పష్టం చేసిన ఎస్పీ, ప్రతి కేసులో 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. తీవ్రత ఎక్కువగా ఉన్న కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.జిల్లాలో మహిళా సంబంధిత కేసుల్లో ఇప్పటికే 37 మందికి కోర్టుల ద్వారా శిక్షలు ఖరారయ్యాయి. ఇందులో ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, ఐదుగురికి 20 సంవత్సరాల జైలు శిక్షలు పడడం పోలీస్ శాఖ పనితీరుకు నిదర్శనంగా నిలిచింది.శక్తి యాప్, శక్తి టీమ్‌ల ద్వారా మహిళల్లో భద్రతా అవగాహన పెంచడంతో పాటు సైబర్ నేరాలపై కూడా ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. మహిళల రక్షణలో రాజీ ఉండదనే సందేశాన్ని 'ఆపరేషన్ దండాయన' ద్వారా సమాజానికి చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు.

# సూర్యలంకకు స్వర్ణశోభ

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

సూర్యలంక: బాపట్ల జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి కొత్త ఊపునిచ్చేలా సూర్యలంక బీచ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి శనివారం ప్రారంభించారు. బీచ్ ఆఫీస్, బీచ్ మెడికల్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌లను ప్రారంభించిన మంత్రి, అత్యవసర సేవల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పరికరాలను పరిశీలించారు. అలాగే బే ఆఫ్ బాపట్ల లోగోతో రూపొందించిన టోపీలు, జనపనార సంచులు, కీచైన్‌లను పంపిణీ చేశారు.కార్యక్రమానికి ముందు బీచ్ పరిసరాల్లో కొబ్బరి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం చాటారు. పునర్నిర్మించిన బీఎస్ఎన్ఎల్ టవర్‌ను కూడా ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పర్యాటక, పారిశ్రామిక రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని, స్వదేశీ దర్శన్ పథకం కింద చేపట్టిన పనులు అక్టోబర్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు.మత్స్యకారుల ప్రయోజనాలకు భంగం కలగకుండా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, స్థానిక ప్రజలు కూడా పర్యాటకాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. సూర్యలంకను రాష్ట్ర పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు కలిగిన కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి. కోటేశ్వరరావు, బాపుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, ఆర్డీఓ గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

# బాపట్లలో జనసేనకు నాయకత్వ సంక్షోభం?

మొదటి పేజీ తరువాయి

బాపట్ల: రక్షణ బ్యూరో....

బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ పరిస్థితిపై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, బాపట్లలో మాత్రం ఆశించిన స్థాయిలో బలపడలేకపోయిందన్న అభిప్రాయం రోజురోజుకీ పెరుగుతోంది. ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు వ్యక్తిగతంగా భావోద్వేగ అనుబంధం ఉన్న ప్రాంతంగా బాపట్లను చెప్పుకుంటూ వచ్చిన నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులు పార్టీ శ్రేణులను కలవరపెడుతున్నాయి.పవన్ కళ్యాణ్ అనేక సందర్భాల్లో తన బాల్య జ్ఞాపకాలు, విద్యాభ్యాసం, కుటుంబ అనుబంధాలను బాపట్లతో ముడిపెట్టి మాట్లాడుతుంటారు. అలాంటి ప్రాంతంలోనే జనసేన పార్టీకి స్పష్టమైన నాయకత్వం కనిపించకపోవడం రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. పార్టీకి యువతలో, కొన్ని సామాజిక వర్గాల్లో గట్టి మద్దతు ఉన్నప్పటికీ దాన్ని ఓటు శక్తిగా, కార్యాచరణ శక్తిగా మలిచే స్థానిక నాయకత్వం ఇప్పటివరకు రూపుదిద్దుకోలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం బాపట్ల జనసేనలో ప్రధాన సమస్య నాయకత్వ లోపమేనన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోంది. పార్టీ ఇన్‌ఛార్జ్‌గా ఉన్న నాయకుడు చాలాకాలంగా పార్టీలో పనిచేస్తున్నప్పటికీ, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ నిర్మాణం బలహీనంగానే ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కూడా బాపట్ల నియోజకవర్గం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించలేకపోయిందన్న ప్రచారం సాగుతోంది. ఇతర నియోజకవర్గాల్లో పార్టీ కార్యాచరణ చురుకుగా కనిపిస్తుండగా, బాపట్లలో మాత్రం పెద్దగా కదలిక కనిపించకపోవడం పార్టీ అంతర్గత వర్గాలను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. పార్టీ జెండాలు, కార్యక్రమాలు, సమావేశాలు, ప్రజా సమస్యలపై నిరసనలు వంటి అంశాల్లో జనసేన కనిపించడం తగ్గిపోయిందని స్థానికంగా చర్చ జరుగుతోంది.ఇక్కడ మరో ప్రధాన సమస్యగా వర్గపోరు కనిపిస్తోంది. బాపట్ల జనసేన రెండు వర్గాలుగా విడిపోయిందన్న ప్రచారం చాలా కాలంగా కొనసాగుతోంది. అయితే ఆ రెండు వర్గాలు కూడా పార్టీని బలోపేతం చేసే స్థాయిలో పనిచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వ్యక్తిగత ఆధిపత్య పోరాటాలు పెరగడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు అయోమయంలో పడుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.పార్టీ కోసం ఆర్థికంగా, సామాజికంగా బలమైన నాయకత్వం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నవారు చాలామంది ఉన్నప్పటికీ, వారిని గుర్తించే ప్రక్రియలో జిల్లా నాయకత్వం విఫలమవుతోందని కొందరు నేతలు ఆరోపిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడే వారికంటే, కొద్దిమంది చుట్టూ మాత్రమే వ్యవస్థ తిరుగుతోందన్న అసంతృప్తి కూడా ఉంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జనసేన పార్టీకి రాజకీయంగా మంచి అవకాశాలు వచ్చాయని, ఆ అవకాశాలను బాపట్లలో సద్వినియోగం చేసుకోవడంలో నాయకత్వం విఫలమైందన్న అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీగా ఉండి కూడా స్థానికంగా ఒక్క బలమైన నాయకుడిని తయారు చేయలేకపోవడం పార్టీ భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

జిల్లా కమిటీల పునర్వ్యవస్థీకరణ, నియోజకవర్గాల వారీగా నాయకత్వ గుర్తింపు ప్రక్రియ ప్రస్తుతం జరుగుతున్న నేపథ్యంలో బాపట్లపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా యువతను ఆకర్షించే శక్తి జనసేనకు ఉన్నప్పటికీ, దాన్ని సమన్వయం చేసే నాయకత్వం లేకపోవడం పెద్ద లోపంగా మారిందని కార్యకర్తలు చెబుతున్నారు.బాపట్లలో జనసేన పార్టీకి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత ఇమేజ్, కూటమి ప్రభుత్వంలో పార్టీ పాత్ర, యువతలో ఉన్న ఆదరణ. అయితే ప్రస్తుతం పార్టీని నడిపించే స్థాయి నాయకత్వం లేకపోవడం వల్ల ఆ బలం పూర్తిగా ఉపయోగపడటం లేదని అంటున్నారు.

పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ బాపట్లపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయి నుంచి నాయకత్వాన్ని గుర్తించి, బలమైన టీంను ఏర్పాటు చేస్తే పరిస్థితులు మారే అవకాశం ఉందని జనసేన కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసే నాయకులను ముందుకు తీసుకువస్తే బాపట్లలో జనసేన మళ్లీ చురుకుదనం సాధించగలదని భావిస్తున్నారు.ప్రస్తుతం బాపట్లలో వినిపిస్తున్న ఒకే మాట---"జనసేనకు బలం ఉంది... కానీ ఆ బలాన్ని నడిపించే నాయకత్వమే కనిపించడం లేదు."

# సీఎం రాకకు సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

గుంటూరు రక్షణ న్యూస్

గుంటూరు నగరంలో జూన్ 3న జరగనున్న పీవీఎస్ లలితా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్న నేపథ్యంలో నగర పాలక సంస్థ యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఈ క్రమంలో నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ హాస్పిటల్ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పర్యటన సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశాన్ని పకడ్బందీగా నిర్వహించాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా హాస్పిటల్ పరిసర ప్రాంతాలు, సభా ప్రాంగణం, రహదారులు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజారోగ్య శాఖ అధికారులకు స్పష్టం చేశారు.హెలిప్యాడ్ నుంచి హాస్పిటల్ వరకు సీఎం ప్రయాణ మార్గంలో పారిశుధ్యం, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు సమన్వయంతో చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో పీవీ ఎస్ లలితా హాస్పిటల్ డాక్టర్ రాఘవ శర్మ, ఆర్డీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్ బి. శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐగా శివకుమార్ యాదవ్‌కు పదోన్నతి

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ న్యూస్

చందోల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న మద్రి వెంకట శివకుమార్ యాదవ్ గారికి ఇన్స్పెక్టర్ హోదాకు పదోన్నతి లభించింది. పోలీస్ శాఖలో ఆయన చూపిన క్రమశిక్షణ, సేవాభావం, ప్రజలతో మమేకమై పనిచేసే తీరు ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంది.తన సేవా కాలంలో ప్రజా సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణలో విశేషంగా కృషి చేసిన ఆయనకు ఈ పదోన్నతి రావడం పట్ల సహచర పోలీస్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు, పోలీస్ సిబ్బంది మద్రి వెంకట శివకుమార్ యాదవ్ గారిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 5/31/2026 3:45 AM Page 3



# ఉపాధి పనుల పై కలెక్టర్ తనిఖీ

**ఒంగోలు రక్షణ న్యూస్**

ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గంలోని కొరిశపాడు మండలం పి.గుడిపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫీడర్ చానెళ్ల పనులను జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు శుక్రవారం పరిశీలించారు. పనుల నిర్వహణ, నాణ్యత, పురోగతిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన ఆయన ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వేతనాల చెల్లింపు, పని పరిస్థితులు, అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు ఉపాధి హామీ పథకం గ్రామీణాభివృద్ధికి కీలకమని పేర్కొన్న కలెక్టర్, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేస్తూ అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.



# కార్మిక హక్కులే సీఐటీయూ లక్ష్యం

**బాపట్ల రక్షణ న్యూస్**

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని వ్యవసాయ ఇంజనీరింగ్ సాంకేతిక విద్య కళాశాల వద్ద శుక్రవారం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో కలిసి యూనియన్ నాయకులు ఓ. లక్ష్మణ, నిరంజన్‌లు ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాపట్ల పట్టణ నాయకుడు కె. శరత్ మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన కోసం సీఐటీయూ ఐదు దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. 1970 మే 30న కోల్‌కతాలో ఆవిర్భవించిన సీఐటీయూ దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఆయన విమర్శించారు. కార్మిక చట్టాల స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ



సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను పరిరక్షించుకోవచ్చని, రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతే ప్రగతికి పునాది



**చీరాల రక్షణ న్యూస్**

స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చీరాల మున్సిపాలిటీలో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆధ్వర్యంలో శనివారం ముమ్మరంగా నిర్వహించారు. 31వ వార్డులో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని వీధులు, కాలువలు, పరిసర ప్రాంతాల పరిశుభ్రత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ స్వచ్ఛమైన చీరాల నిర్మాణమే తమ లక్ష్యమని అన్నారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యత వహించాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా తాను స్వయంగా శుభ్రత కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. గత రెండేళ్లుగా మున్సిపల్ యంత్రాంగం సహకారంతో నిరంతరం సానిటేషన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చీరాలను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన, పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు మహిళా సంఘాలు, యువత, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం పట్టివేత



**మార్కాపురం రక్షణ న్యూస్**

మార్కాపురం మండలం వేములకోట గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 150 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందజేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఒక ఆటోలో అనుమానాస్పదంగా తరలిస్తున్న బియ్యాన్ని గుర్తించిన అధికారులు వాహనాన్ని ఆపి పరిశీలించారు. పరిశీలనలో 150 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు నిర్ధారించడంతో వెంటనే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆటోను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న బియ్యం ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారం వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రేషన్ సరుకులను అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం లేదా విక్రయించడం చట్టవిరుద్ధమని అధికారులు హెచ్చరించారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, సమాచారం తెలిసిన ప్రజలు అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# బైక్‌ల ఢీ ముగ్గురికి గాయాలు

**ముండ్లమూరు రక్షణ న్యూస్**



ముండ్లమూరు మండలంలోని నూజిలపల్లి--గంగన్నపాలెం గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించిన అనంతరం వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఈ ఘటనతో ప్రమాద ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాద వార్తతో బాధితుల కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 5/31/2026 3:45 AM Page 4



## మానవత్వం చాటిన పోలీసులు



గుంటూరు రక్షణ న్యూస్

విధి నిర్వహణలో భాగంగా మరణించిన హోం గార్డు కుటుంబానికి గుంటూరు జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో రూ.10.32 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు చేపట్టిన ఈ చర్య పట్ల పలువురు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.అదే సమయంలో మరో హోం గార్డు కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకున్న జిల్లా పోలీసు సిబ్బంది మానవత్వంతో స్పందించారు. తమ ఒక రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా విరాళంగా అందజేసి సహోద్యోగి కుటుంబానికి అండగా నిలిచారు. ఉద్యోగ బంధాన్ని మానవీయ బంధంగా మార్చి చూపిన ఈ చర్య పోలీసు శాఖలోని ఐక్యతను, సహృదయతను ప్రతిబింబిస్తోంది.ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ పోలీసు కుటుంబాల సంక్షేమానికి శాఖ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న తోటి ఉద్యోగి కుటుంబానికి సహాయం చేసేందుకు ముందుకొచ్చిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.సమాజంలో పరస్పర సహకారం, మానవత్వానికి ఈ ఘటన ఒక మంచి ఉదాహరణగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో పోలీసు శాఖ చూపిన చొరవ ఆదర్శప్రాయమని కొనియాడారు.

## ఐజి అభినందనలు



గుంటూరు రక్షణ న్యూస్

దక్షిణ కోస్తా జోన్ పరిధిలో విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన 24 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లుగా (సీఐలు) పదోన్నతులు లభించాయి. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అభినందించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణ, గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించిన అధికారులకు ఈ పదోన్నతులు దక్కడం అభినందనీయమని ఐజీ పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ప్రతి పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు మరింత కృషి చేయాలని సూచించారు.పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విధంగా వ్యవహరించాలని, చట్ట అమలులో నిష్పాక్షికత, క్రమశిక్షణ, సేవాభావం పాటించాలని ఆయన సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన, నేర నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత వంటి అంశాల్లో మరింత అప్రమత్తంగా పనిచేయాలని కోరారు.పదోన్నతి పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఐజీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులు ఐజీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదల కల సాకారం

పెదకాకాని రక్షణ న్యూస్

రాష్ట్రంలో 22ఏ కింద ఉన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ సమస్యకు ప్రభుత్వం జీవో నెం.306 ద్వారా పరిష్కారం చూపిందని టీడీపీ రాష్ట్ర నాయకులు కొర్రపాటి సురేష్, రాష్ట్ర గిరిజన నాయకులు తిరువీధుల శంకర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని మండల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.సుదీర్ఘకాలంగా పేద, మధ్యతరగతి కుటుంబాలను వేధిస్తున్న 22ఏ ఆంక్షల సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. ఈ జీవో అమలుతో వేలాది కుటుంబాలకు తమ ఇళ్ల స్థలాలపై పూర్తి హక్కులు లభించి, రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఈ సమస్య పరిష్కారం కోసం అసెంబ్లీతో పాటు వివిధ వేదికలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే జీవో 306 విడుదలైందని కొనియాడారు.గత పదేళ్లకు పైగా ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తూ ఇంటి పన్ను, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సహా పేద కుటుంబాలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో టీడీపీ నేతలు కోలాటపు మాణిక్యరావు, ఇస్సర్ల అమృతరావు తదితరులు పాల్గొన్నారు.




# లోకేశ్‌పై జగన్‌ది రాజకీయ కక్ష.. ప్రత్తిపాటి

చిలకలూరిపేట రక్షణ న్యూస్

అమరావతి, మే 30: మంత్రి నారా లోకేశ్ పెరుగుతున్న రాజకీయ ప్రభావాన్ని చూసి వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలకు తెరలేపారని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో లోకేశ్ జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుండటంతో ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే మార్గం లేక వైసీపీ కొత్త కథనాలను సృష్టిస్తోందని ఆరోపించారు.ఐదేళ్ల పాలనలో జగన్ చేయలేకపోయిన పనిని లోకేశ్ కొద్ది నెలల్లోనే చేసి చూపించారని, 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ద్వారా వేలాది నిరుద్యోగ కుటుంబాల్లో ఆశలు నింపారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ప్రజల్లో లోకేశ్‌కు పెరుగుతున్న ఆదరణ, యువతలో ఏర్పడుతున్న విశ్వాసమే వైసీపీని కలవరపెడుతోందని అన్నారు.డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్, వాటికి సంబంధించిన ఒక్క ఆధారమైనా చూపించగలరా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నిజంగా అవకతవకలు జరిగి ఉంటే న్యాయపరంగా పోరాడకుండా కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కావడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. ప్రజల దృష్టిని మరల్చడానికే వైసీపీ నేతలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని విమర్శించారు.మరోవైపు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని లోకేశ్ చేసిన ప్రకటన ఆయన దూరదృష్టికి నిదర్శనమని ప్రత్తిపాటి కొనియాడారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్న లోకేశ్‌కు రాష్ట్రవ్యాప్తంగా మహిళల మద్దతు మరింత పెరుగుతోందని, అదే భవిష్యత్ రాజకీయాల్లో ఆయనను మరింత బలమైన నాయకుడిగా నిలబెడుతుందని వ్యాఖ్యానించారు. జగన్ విమర్శలు ఎంత పెరిగినా, లోకేశ్ ప్రజాదరణను అడ్డుకోలేవని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.



# వినుకొండలో విమర్శల వేడి

వినుకొండ రక్షణ న్యూస్

పల్నాడు జిల్లా రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వినుకొండ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలే రాజ్యమేలాయని ఆరోపించారు.వినుకొండ అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడ్డారని బొల్లాపై జీవీ విమర్శలు సంధించారు. అధికార మార్పు జరిగినప్పటికీ అక్రమాల నీడ ఇంకా కొనసాగుతోందని, ప్రభుత్వ భూముల వ్యవహారాల్లో ఫోర్జరీ పత్రాలు, నకిలీ జీవోలతో భారీ కుట్రలు జరిగాయనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు తప్పదని హెచ్చరించారు.అదే సమయంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను జీవీ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలకు కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తున్నారని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.గత పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అందుకే అభివృద్ధి–విధ్వంసం మధ్య తేడాను ప్రజలు స్పష్టంగా గుర్తించారని జీవీ వ్యాఖ్యానించారు. వైసీపీ హయాంలో చోటుచేసుకున్న వ్యవహారాలపై విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. జీవీ చేసిన ఈ వ్యాఖ్యలు వినుకొండతో పాటు పల్నాడు జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీశాయి.

